వైభవంగా నిత్య తిరుకల్యాణోత్సవం

నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మే 27 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. సోమవారం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతును చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతును జరిపారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలు ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. అనంతరం స్వామివారికి హారతినిచ్చి భక్తుల గోత్రనామాల పేరిట సంకల్పం చేశారు. సాయంత్రం స్వామివారికి గరుఢ వాహనంపై, అమ్మవారికి తిరుచ్చి సేవపై వేంచేపు చేసి జోడు సేవను తిరువీధుల్లో ఊరేగించారు. ప్రధానాలయ ముఖ మండపంలో దర్బార్‌సేవలో భాగంగా సువర్ణ మూర్తులకు ప్రత్యేక పూజలు జరిపి నక్షత్ర హారతినిచ్చారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో కొండపైన రద్దీ నెలకొన్నది. క్యూలైన్లు, తిరుమాఢవీధులు, ప్రసాద విక్రయశాల, బస్టాండ్ వద్ద భక్తుల రద్దీ కనిపించింది. అనుబంధ రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్ఫటిక లింగేశ్వరుడికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం చేపట్టారు. సుమారు 25వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.62,67,807 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లను ఈఓ భాస్కర్‌రావు పరిశీలించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఈఈ దయాకర్‌రెడ్డి, ఏఈఓ గట్టు శ్రవణ్‌కుమార్ ఉన్నారు.

పోలింగ్ మెటీరియల్‌ను జాగ్రత్తగా అప్పగించాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, మే 27 : పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ మెటీరియల్‌ను బందోబస్తు మధ్య జాగ్రత్తగా నల్లగొండ స్ట్రాంగ్ రూమ్‌లో అప్పగించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే సూచించారు. సోమవారం సాయంత్రం రాయగిరిలోని విద్యాజ్యోతి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌ను డీసీపీ రాజేశ్‌చంద్రతో కలిసి సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చే పోలింగ్ బాక్సులు, మెటీరియల్ జాగ్రత్తగా పరిశీలించి తీసుకొని తిరిగి వాటిని బందోబస్తు మధ్య నల్లగొండలోని స్ట్రాగ్ రూములో అప్పగించాలని భువనగిరి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అమరేందర్‌కు సూచించారు.

బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిదే విజయం

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి



ఆలేరు రూరల్ : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

ఆలేరు రూరల్/ మోటకొండూరు, మే 27 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి అన్నారు. ఆలేరులో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. అదేవిధంగా మోటకొండూరు మండల కేంద్రంలో పోలింగ్ సరళిని పరిశీలించి అనంతరం కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలోని 34 అసెంబ్లీ సెగ్మెంట్లలో తెలుసుకున్న సమాచారం మేరకు రాకేశ్‌రెడ్డి గెలుపొందడం ఖాయమన్నారు. బీఆర్ఎస్‌తోనే పట్టభద్రులకు న్యాయం జరుగుతుందని పట్టభద్రులు గ్రహించి బీఆర్ఎస్‌కు ఓటు వేశారని తెలిపారు. 15 రోజుల నుంచి రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేసిన బీఆర్ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మోటకొండూరులో నార్మూల్ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, ఎంపీపీ పైళ్ల ఇందిరాసత్యనారాయణరెడ్డి, జడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య, ఎంపీటీసీ పన్నాల అంజిరెడ్డి, ఆలేరులో మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు పుట్ట మల్లేశ్‌గౌడ్, కౌన్సిలర్లు బేతి రాములు, జూకంటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

రాకేశ్‌రెడ్డి గెలుపు ఖాయం : జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

ఓటర్లకు పోలింగ్ చిట్టీలను అందజేస్తున్న జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, మే 27 : ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపు ఖాయమని జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. భూదాన్ పోచంపల్లిలో సోమవారం ఓటర్లకు పోలింగ్ స్లిప్పులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 420 హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిని అమలు చేయడం లేదన్నారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోతే సమస్యలు పరిష్కారం కావని పేర్కొన్నారు. వారి వెంట ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, పార్టీ నాయకులు ఉన్నారు.

జిల్లాలో 78.59 శాతం పోలింగ్

ముగిసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

- బొమ్మలరామారం మండలంలో అత్యధికంగా 87.22 శాతం
- వెబ్ కాస్టింగ్ ద్వారా ఓటింగ్ ప్రక్రియ పర్యవేక్షణ

యాదగిరిగుట్టలో ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు

యాదాద్రి భువనగిరి, మే 27 (నమస్తే తెలంగాణ) : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. సోమవారం రాత్రి వరకు 78.59 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ తీరును వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. పోలింగ్ ముగియడంతో బ్యాలెట్ బాక్సులను అర్ధరాత్రి నల్లగొండలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించేందుకు చర్యలు చేపట్టారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 144 సెక్షన్ అమలు చేసి, పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసి విజయంతంగా ముగించింది. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో మొత్తం 34,080 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 13,242, పురుషులు 20,838 మంది ఉన్నారు. పోలింగ్ ప్రక్రియ సాఫీగా జరుగడానికి రెండు డివిజర్లు, ఆరు రూట్లుగా విభజించారు. 37 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రమే భువనగిరి, చౌటుప్పల్‌లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు. పోలీస్ బందోబస్తు మధ్య ఆర్టీసీ బస్సుల్లో మండలాలకు సామగ్రి తరలివెళ్లింది. బ్యాలెట్ విధానంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహించారు. 52 మంది అభ్యర్థులు బరిలో ఉండటంతో జంబో బ్యాలెట్ పేపర్‌ను తయారు చేశారు. సోమవారం ఉదయం తొలుత మాక్ పోలింగ్ నిర్వహించారు. ఆయా పార్టీల ఏజెంట్లను అనుమతించారు. ఆ తర్వాత ఉదయం 8గంటలకు పోలింగ్ షురూ అయ్యింది. పోల్ చీటీతోపాటు గుర్తింపు కార్డును చూసిన తర్వాతే ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు.

పోలింగ్ ఇలా..

ఉప ఎన్నిక పోలింగ్ సరళి సాఫీగా కొనసాగింది. ఉదయం కాస్త మందకొడిగా పోలింగ్ జరుగగా, మధ్యాహ్నం తర్వాత పెరిగింది. ఎండల నేపథ్యంలో వీలైనంత త్వరంగా ఓటు వేసేందుకు ఓటర్లు ఆసక్తి చూపించారు. ఉదయం 8నుంచి 10గంటల వరకు 11.26 శాతం ఓట్లు పోలయ్యాయి. 12గంటల వరకు 27.71శాతం, మధ్యాహ్నం రెండింటి వరకు 47.92, నాలుగు గంటల వరకు 78.59 శాతం పోలింగ్ రికార్డయ్యింది. 4గంటల వరకు 26,785 ఓట్లు పోలవగా, అందులో 16,605 మంది పురుషులు, 10,180 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అత్యధికంగా బొమ్మలరామారంలో 87.22 శాతం పోలింగ్ నమోదైంది. భూదాన్ పోచంపల్లిలో 84.23శాతం, మోత్కూరులో 79.68, యాదగిరిగుట్ట మండలంలో 75.76, వలిగొండలో 77.73, ఆలేరులో 74.97శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం నాలుగు గంటల వరకు క్యూలో నిల్చున్న వారికి ఓటేసే అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో పోలింగ్ శాతం కొద్ది మేర పెరిగే ఛాన్స్ ఉంది.

144 సెక్షన్ అమలు

పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులు చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర పోలీస్ సిబ్బందితోపాటు కేంద్ర బలగాలు విధులు నిర్వహించాయి. ఆదివారం రాత్రే పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించకుండా పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించింది. పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. రాజకీయ పార్టీలు ప్రచార కార్యక్రమాలు నిర్వహించకుండా, కోడ్ ఉల్లంఘించకుండా చర్యలు తీసుకున్నారు.

ప్రత్యేక బృందాల పర్యవేక్షణ

ఎన్నికల పర్యవేక్షణకు ప్రత్యేకంగా 52 బృందాలను ఏర్పాటు చేశారు. ఇందులో 12మంది సెక్టార్ అధికారులు, ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్, 17వీడియో వ్యూవింగ్, 17 ఎంసీసీ బృందాలు ఉన్నాయి. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు విధులు నిర్వహించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక అధికారి ఉండేలా 47 మంది ప్రిసైడింగ్ అధికారులను నియమించారు. ఓపీఓలు 141, ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు 47 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించారు. వీరితో పాటు మరికొంత మంది సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచారు.

నల్లగొండ స్ట్రాంగ్ రూమ్‌లకు బ్యాలెట్ బాక్సులు

పోలింగ్ ప్రక్రియ ముగియడంతో బ్యాలెట్ బాక్సులను పకడ్బందీగా స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. పోలీసుల పర్యవేక్షణలో ఆయా పోలింగ్ స్టేషన్ల నుంచి రవాణా చేశారు. బ్యాలెట్ బాక్సులు తరలించే వాహనాలకు జీపీఎస్‌లను ఏర్పాటు చేశారు. నల్లగొండలోని అనిశెట్టి దుప్పలపల్లిలో ఉన్న ఎఫ్‌సీఐ గోదాంలోకి తరలించారు. బాక్సుల తరలింపు ప్రక్రియలను ఆర్డీఓలు పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు.

చౌటుప్పల్‌లో 78.64శాతం పోలింగ్

చౌటుప్పల్‌లో ఓట్లు వేసేందుకు బారులు దీరిన పటభద్రులు

చౌటుప్పల్‌లో చంటి బిడ్డతో ఓటు వేసేందుకు వచ్చిన మహిళ

చౌటుప్పల్ : మండలంలో 78.64 శాతం పోలింగ్ నమోదైంది. 3,854 మంది ఓటర్లకు గానూ 3,031 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు వచ్చి క్యూలో ఉన్నవారికి ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. రెండు బూత్‌లలో 6గంటల వరకు పోలింగ్ కొనసాగింది. సమయం ముగిసిన తర్వాత వచ్చిన వారిని లోపలికి అనుమతించకపోవడంతో కొంత మంది ఓటు వేయకుండానే వెనుదిరిగారు.

సంస్థాన్ నారాయణపురంలో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కుమారుడు కోడలు

సంస్థాన్ నారాయణపురం : మండలంలో మొత్తం 1,897 ఓట్లకు గానూ 1,491 ఓట్లు పోలయ్యాయి.

మోత్కూరు : మండలంలో 1,496 మంది ఓటర్లకు గానూ 1,192 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 79.68 శాతం పోలింగ్ నమోదైనట్లు తాసీల్దార్ రాంప్రసాద్ తెలిపారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆలేరు రూరల్ : మండలంలో 76శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2,131 మంది ఓటర్లు ఉండగా.. 1,621 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

గుండాల : మండలంలో 1,154 ఓట్లకు గానూ 877 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 273 మంది మహిళలు, 604 మంది పురుషులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 75.99 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి వినోద్ తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎస్ఐ యాకన్న ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్ పోలింగ్ సరళిపై బీఆర్ఎస్ నాయకులను అడిగి తెలుసుకున్నారు.

బొమ్మలరామారం : మండలంలో 814 ఓట్లకు గానూ 710 ఓట్లు పోలయ్యాయి. పురుషులు 456 మంది, మహిళలు 254 మంది ఓటు వేశారు. 87శాతం పోలింగ్ నమోదైనట్లు తాసీల్దార్ శ్రీనివాస్‌రావు తెలిపారు.

భూదాన్ పోచంపల్లి : మండలంలో 1,966 ఓట్లకు గానూ 1,656 ఓట్లు పోలయ్యాయి. 84.23 శాతం పోలింగ్ నమోదైంది. ఓటింగ్ సరళిని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు కొలుపుల అమరేందర్, జడల అమరేందర్ పోలింగ్ సరళిని తెలుసుకున్నారు.

రామన్నపేట : మండలంలో 77శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2,597 ఓట్లకు గానూ 2001 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 1,312 మంది పురుషులు, 689 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ సమయం ముగిసిన తరువాత వచ్చిన 8మంది ఓటర్లను అనుమతించకపోవడంతో వెనుదిరిగి పోయారు. పోలింగ్ సరళిని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్యే వేముల వీరేశం వేర్వేరుగా పరిశీలించారు.

మోటకొండూర్ : మండలంలో 1,054 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా, 828 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో 536 మంది పురుషులు, 292 మంది మహిళలు ఓటు వేశారని తాసీల్దార్ శాంతిలాల్ తెలిపారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలో 77.19 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో మొత్తం ఓటర్లు 1,565 ఉండగా, 1,208 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రాజాపేట : మండలంలో 998 మంది ఓట్లకు గానూ 796 ఓట్లు పోలయ్యాయి. ఇందులో మహిళలు 263, పురుషులు 533 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తాసీల్దార్ దామోదర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ రమేశ్‌కుమార్ సందర్శించారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి గెల్లు శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ నాయకురాలు కాదురి అరుణ, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు ఓటింగ్ సరళిని పరిశీలించారు.

బీబీనగర్ : మండల కేంద్రంలో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయగా.. 1,954 మంది ఓటర్లకు గానూ 1,574 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 80.5శాతం పోలింగ్ నమోదైంది. బీబీనగర్ పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి వేర్వేరుగా సందర్శించారు.

తుర్కపల్లి : మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం 962 ఓట్లకు గానూ 819 ఓట్లు పోలయ్యాయి. 85.13శాతం పోలింగ్ నమోదైంది. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల పోలింగ్ కేంద్రంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, జడ్పీ వైస్ చైర్మన్ దనావత్ బీకూనాయక్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

యాదగిరిగుట్ట : పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఉదయం 8నుంచే ఓటర్లు బారులు దీరారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మోటకొండూరులో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్‌గౌడ్ ఓటు వేశారు.

స్ట్రాంగ్‌రూమ్‌కు బ్యాలెట్ బాక్స్ వాహన తరలింపులో ఆర్డీవో అమరేందర్

భూదాన్ పోచంపల్లిలో బారులుదీరిన ఓటర్లు

మోటకొండూర్ మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఓటును వినియోగించుకున్న టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ దంపతులు

మోటకొండూర్ మండల కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్‌గౌడ్ దంపతులు

భూదాన్ పోచంపల్లి : ఓటు వేసేందుకు వస్తున్న దివ్యాంగురాలు

పోలింగ్ సరళిని పరిశీలించిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

వలిగొండలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పోలింగ్ సరళిని పరిశీలించిన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

భువనగిరి అర్బన్, మే 27 : పట్టణంలో ఉదయం 9గంటల వరకు పోలింగ్ మందకొడిగా సాగగా.. 10నుంచి 12 గంటల వరకు పట్టభద్రులు అధిక సంఖ్యలో వచ్చారు. సాయంత్రం 4 గంటల తర్వాత వచ్చిన కొంతమంది ఓటర్లు ఓటు వేసేందుకు అవకాశం లేకపోవడంతో వెనుదిరిగారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్ సందర్శించి ఓటింగ్ తీరును అడిగి తెలుసుకున్నారు. కాగా, భువనగిరి పట్టణానికి చెందిన ఓ యువతి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని పోలింగ్ కేంద్రానికి రాగా.. అధికారులు పరిశీలించినీ ఓటును ఎవరో వేశారని చెప్పడంతో నివ్వెరపో యింది. ఆమె గట్టిగా నిలదీయడంతో టెండర్ ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు.

వలిగొండ : మండల కేంద్రంలో సాయంత్రం 4 గంటలకు గేటు లోపల ఉన్న ఓటర్ల కోసం అధికారులు సుమారు 2గంటలపాటు పోలింగ్ సమయాన్ని పొడిగించి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించారు. చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, తాసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ మహేందర్‌లాల్ పర్యవేక్షించారు. మండలలో 3,561 ఓట్లకు గానూ 2,768 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతం 77.73గా నమోదైంది. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, క్యామ మల్లేశం, స్థానిక నాయకులతో కలిసి పోలింగ్ సరళిని పరిశీలించారు.

రాజాపేటలో ఓటు వేయడానికి బారులు దీరిన మహిళా పట్టభద్రులు

గుండాల : ఓటు వేసేందుకు లైన్‌లో నిలబడ్డ పట్టభద్రులు

ఆత్మకూరు(ఎం) ఓటు హక్కును వినియోగించుకున్న పట్టభద్రులు

వలిగొండలో ఓటు హక్కును వినియోగించుకోవడానికి క్యూలైన్‌లో నిలబడిన పట్టభద్రులు

రామన్నపేటలో బారులు దీరిన ఓటర్లు